27092024-MAI-04_Layout 1 9/27/2024 1:32 AM Page 1

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నేడు

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఉద్యోగాల ఊచకోత

అమెరికా టెక్ జాబ్ మార్కెట్‌లో ఊచకోతలు నిత్యకృత్యమవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు టెక్ కంపెనీలు సుమారు 1,37,500 ఉద్యోగాలకు కోత విధించాయి. మరో అంచనా ప్రకారం.. ఉద్యోగాలు కోల్పోయినవారి సంఖ్య 2,15,402. ఇందులో అత్యధిక కోతలు ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో జరగడం గమనార్హం. ఏడాది కాలంలో ఉద్యోగుల తొలగింపు 98 శాతం పెరిగింది. వచ్చే ఏడాది ఖర్చుల తగ్గింపు కోసం ఈ ఏడాది ఆగస్టు 1న ఇంటెల్ కంపెనీ 15 శాతం సిబ్బందిని తొలగించింది. సిస్కో, ఐబీఎం, అమెజాన్ అదే బాటపట్టాయి. ఈ ఊచకోతలపై సామాజిక మాధ్యమాల్లో ఐటీ ఉద్యోగులు గగ్గోలు పెట్టడం మనం చూస్తున్నాం. దీంతో కంపెనీలు గుట్టుచప్పుడు కాకుండా తొలగింపులు జరిపే ఎత్తుగడలను అమలు చేస్తున్నాయి. పెద్దపెద్ద ప్రకటనలు చేయకుండా లోపల్లోపల పనితీరు సరిగా లేదనో, మరో కారణం మీదనో తొలగింపులకు పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితి ఉద్యోగుల్లో ఆందోళనను, మానసిక ఒత్తిడిని పెంచుతున్నది. జీతాల పెంపు డిమాండ్లను అణచివేసేందుకు కూడా ఈ ధోరణి తోడ్పడుతున్నది. కొన్ని కంపెనీలు ఇదే అదనుగా జీతాల కోతలూ విధిస్తుండటం గమనార్హం.

అమెరికాలో ఉద్యోగాల సంక్షోభం అక్కడి జాబ్ మార్కెట్‌లో ప్రధాన వర్గమైన ఎన్నారైలకు గుదిబండగా మారింది. రెండున్నర దశాబ్దాల్లో ఇంతటి సంక్షోభం ఎన్నడూ చూడలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఉద్యోగాల ఊచకోతకు కారణాలను అన్వేషిస్తే పెరుగుతున్న మాంద్యం భయాలు, కంపెనీలకు ప్రాజెక్టులు తగ్గిపోవడమే మనకు ప్రధానంగా కనిపిస్తాయి. జీతాల ఖర్చు తగ్గించేందుకు పేద, మధ్యాదాయ దేశాలకు యూనిట్లను తరలించడం మరో కారణం. లేఆఫ్‌లు పెరుగుతున్న నేపథ్యంలో హెచ్-1బీలకు సైతం ఉద్యోగాలు దొరకని పరిస్థితి ఎదురవుతున్నది. ఇక లక్షలు పోసి ఎంఎస్ చదవడానికి వెళ్లిన చాలామంది సరైన ఉద్యోగాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. అమెరికాలో అమలయ్యే కఠిన నిబంధనలు వారిని తరుముతున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి ఉద్యోగాల పరిస్థితి మరింతగా దిగజారిపోతుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ పరిస్థితి అమెరికాకే పరిమితం కాలేదు. కెనడా, యూకే, జర్మనీ, స్వీడన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ఉద్యోగ సంక్షోభం వెంటాడుతున్నది. ప్రపంచవ్యాప్త ఉద్యోగాల కోతల్లో సింహభాగం ఈ దేశాలదే.

ఉద్యోగ కోతల కారణంగా ప్రధానంగా ఇబ్బందులు పడుతున్నది భారతీయులేనన్న సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'ఏ దేశమేగినా, ఎందుకాలిడినా..' అన్నట్టు ఎక్కడచూసినా మనవాళ్లే ఉండటం అందుకు ప్రధాన కారణం. డాలర్ కలలు చెదిరిపోతున్న ప్రస్తుత తరుణంలో భారత సంతతి ఉద్యోగులను ఆదుకునేందుకు కేంద్రం నిర్దుష్టమైన వ్యూహం, ఎత్తుగడలు రూపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కేవలం నినాదంగా మిగిలిపోయిన 'మేకిన్ ఇండియా'ను దుమ్ము దులిపి చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన అవసరమూ ఉంది.

ఇది పట్టం కట్టుడా? మభ్యపెట్టుడా?

రెండు వారాల కిందట నూనె గింజలు, ఉల్లిపాయలు, బాస్మతి బియ్యానికి సంబంధించిన వాణిజ్య విధానాల్లో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు చేసింది. దీనివల్ల అక్టోబర్ మాసంలో మొదలయ్యే ఖరీఫ్ పంట కాలంలో గ్రామీణ రైతాంగ ఆదాయాలు పెరుగుతాయనేది అంచనా. బాస్మతి బియ్యం తాలూకు కనీస ఎగుమతి ధర టన్నుకు 950 డాలర్లకు పైబడే ఉండాలన్న గతంలోని నిబంధనను తొలగించడం ఈ విధాన మార్పుల్లో ఒకటి. అలాగే, ఉల్లిపాయల ఎగుమతి తాలూకు కనీస ధర టన్నుకు 550 డాలర్లుగా ఉండాలన్న నిబంధనను తొలగిస్తూ, దాంతో పాటు ఉల్లి ఎగుమతులపై సుంకాన్ని 40 శాతం నుంచి 20 శాతానికి తగ్గించింది. మరో పక్కన ముడి వంటనూనెలు, శుద్ధి చేసిన వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 36 శాతానికి పెంచింది.

డి.పాపారావు
98661 79615

రైతాంగానికి లాభం చేకూర్చడానికే వాణిజ్య విధానాల్లో మార్పులు చేసినట్టు కేంద్ర ప్రభుత్వం చెప్పున్నది. ఉదాహరణకు బాస్మతి బియ్యంపై కనీస ఎగుమతి ధరను రద్దు చేయడంతో ఆ బియ్యం ఉత్పత్తిదారులు అంతర్జాతీయ మార్కెట్లో తక్కువ ధరను ఆఫర్ చేయడం ద్వారా పోటీని తట్టుకోగల అవకాశాన్ని కల్పించారు. అలాగే, ఉల్లిపాయల ఎగుమతి విషయంలో కూడా. ఇక ముడి, శుద్ధి చేసిన వంటనూనెల దిగుమతులపై సుంకాన్ని పెంచడం ద్వారా, దేశీయ నూనె గింజల ఎగుమతిదారులకు, తక్కువ ధరలకు దిగుమతయ్యే విదేశీ వంటనూనెల పోటీ నుంచి రక్షణ కల్పించారు. ఈ నిర్ణయాలన్నీ కచ్చితంగా ఆయా పంటలు పండించే రైతాంగానికి అనుకూలమైనవే. కాగా, ఇంతకాలం మూడు వ్యవసాయ చట్టాల వంటి రైతాంగ వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ రైతుకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేసేందుకు వెనుకాడిన కేంద్ర ప్రభుత్వం, నేడు ఈ రైతాంగ అనుకూల విధాన మార్పులను ఎందుకు చేసినట్టు?

దీనికి కారణం సుస్పష్టం. త్వరలో జరగనున్న 4 రాష్ట్రాల ఎన్నికలే అందుకు కారణం. అందులోనూ ముఖ్యంగా మహారాష్ట్ర, హర్యానా ఎన్నికలు కేంద్రంలోని ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వానికి అగ్నిపరీక్ష లాంటివి. ఆ రాష్ట్రాల్లో గెలవడం బీజేపీకి అనివార్యం. గత పదేండ్ల పాలనలో తన రైతాంగ వ్యతిరేక విధానాల ద్వారా వారిని బీజేపీ దూరం చేసుకున్నది. దాని ఫలితంగానే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ 240 సీట్లకు పరిమితమైంది. ఒక పక్క నితీష్, మరోపక్క చంద్రబాబుల ఊతకర్ర మద్దతుతో ప్రస్తుతం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ మనుగడ సాగిస్తోంది. ఈ క్రమంలోనే మహారాష్ట్ర, హర్యానా ఎన్నికలు బీజేపీకి గెలిచి తీరాల్సిన అగత్యాన్ని కల్పించాయి. హర్యానాలో బీజేపీకి పూర్తిగా వ్యతిరేక పవనాలు వీస్తున్నందున అక్కడి బాస్మతి బియ్యం ఉత్పత్తిదారుల (రైతులు)ను (దేశంలో అతిపెద్ద బాస్మతి ఉత్పత్తిదారు హర్యానా కావడం గమనార్హం) బుజ్జగించడమే ఈ నిర్ణయం వెనకున్న ఉద్దేశం. ప్రస్తుతం స్థానికంగా బాస్మతి బియ్యానికి అంతగా ధర పలకడం లేదు. అందువల్ల ఆ బియ్యాన్ని 'కనీస ఎగుమతి ధర' అనే ఆటంకం లేకుండా, విదేశాలకు ఎగుమతి చేసుకొనే అవకాశాన్ని రైతులకు కల్పించారు. అదీ విషయం. ఇక, ఉల్లిపాయల విషయంలో కూడా కనీస ఎగుమతి ధర తొలగింపు.. ఎగుమతి సుంకం తగ్గింపు అనేవి దేశంలోనే ఉల్లిపాయల ప్రధాన ఉత్పత్తిదారు అయిన మహారాష్ట్ర రైతులకు లాభం చేకూరుస్తుంది. అలాగే, వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచడం వల్ల మహారాష్ట్రలో సోయాబీన్ పండించే రైతాంగానికి విదేశీ పోటీ నుంచి రక్షణ ఏర్పడుతుంది.

> **అంతిమంగా రైతు అనుకూల విధాన నిర్ణయాల పేరిట ఎన్నికల తంతు పూర్తయ్యే వరకు రైతాంగానికి అరచేతిలో వైకుంఠం చూపించి.. ఆ తర్వాత తిరిగి కచ్చితంగా చుక్కలు చూపిస్తారు! అదీ విషయం.**

రైతాంగానికి అనుకూలమైన ఈ నిర్ణయాలన్నీ 'మనసా వాచా కర్మణా' రైతాంగం మేలు కోరి తీసుకున్నవా? లేదా హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం తీసుకున్నవా? అనే ప్రశ్న ఇప్పుడు వ్యక్తమవుతున్నది. రైతాంగ అనుకూల విధానాల ప్రకటన అనంతరం వాటివెనుకే వెలువడిన కొన్ని ప్రకటనలు.. ముక్తాయింపులను గమనిస్తే ఈ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. నిజానికి ఈ నిర్ణయాలు మార్కెట్లో మాత్రం కొంతమేర ధరల పెరుగుదలకు కారణం కాగలవనేది ఒక అంచనా. బాస్మతి బియ్యం, ఉల్లిపాయల ఎగుమతులకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాల వల్ల దేశంలో ఆ ఉత్పత్తుల లభ్యత తగ్గి, కొంతమేర ధరలు పెరగవచ్చు. అలాగే, వంటనూనెల దిగుమతులపై పెంచిన సుంకాలు కూడా దేశీయంగా వంటనూనెల సరఫరాను తగ్గించి, తద్వారా వాటి ధరల పెరుగుదలకు కారణం కాగలవు. మరి అటువంటప్పుడు, ఈ ధరల పెరుగుదల అంశం ఎన్నికలకు వెళ్లనున్న మహారాష్ట్ర, హర్యానాలలో ప్రజా వ్యతిరేకతకు కారణం కాగలదు కదా? కచ్చితంగా అవుతుంది. అందుకే ఒకపక్క రైతాంగానికి మంచి ధరలు వచ్చేలా నిర్ణయం తీసుకుంటూనే.. మరోపక్క వంటనూనెల ధరలను పెంచవద్దంటూ దేశీయ ఉత్పత్తిదారులకు, వ్యాపారులకు ప్రభుత్వ వర్గాలు విజ్ఞాపనలు చేస్తున్నట్టు సమాచారం.

దాంతోపాటు తక్కువ సుంకంతో ఇప్పటికే దిగుమతి అయిన వంటనూనెల నిల్వలు 3 మిలియన్ టన్నుల మేరకు ఉంటాయని, ఈ నిల్వలు కనీసం 45-50 రోజుల వరకు సరిపోతాయని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. కాగా, దిగుమతి చేసుకుంటున్న వంట నూనెలపై సుంకం పెంచడం, వాటి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకేనని ప్రభుత్వ వర్గాల వాదన. మరి, అదే నిజమైతే.. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కనీసం కొన్ని సంవత్సరాల పాటు దిగుమతులపై ఈ అధిక సుంకాల రక్షణ కవచం దేశీయ రైతాంగానికి అవసరం. తద్వారా మాత్రమే నూనె గింజల ఉత్పత్తి తమకు నికరంగా లాభసాటి అవుతుందనే భరోసాను ప్రభుత్వం రైతుకు కల్పించగలదు. కాబట్టి, దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం కచ్చితంగా కాదని అర్థమవుతున్నది.

ఎందుకంటే, ముందుగానే చెప్పుకున్నట్టుగా ప్రస్తుతం దేశంలో ఉన్న వంటనూనెల నిల్వలు 45-50 రోజుల పాటు సరిపోతాయి గనుక, ఆ ధరలను ప్రస్తుతానికి పెంచనవసరం లేదని వ్యాపారులకు, ఉత్పత్తిదారులకు విజ్ఞప్తులు చేయడం వెనుక అసలు మతలబు ఏమిటి? సూక్ష్మంగా గమనిస్తే.. దీని వెనకున్న మతలబు ఒకటే. అదేమిటంటే.. రానున్న 45-50 రోజులలోగా హర్యానా, మహారాష్ట్రలలో ఎన్నికల ప్రక్రియ ముగిసిపోతుంది. కాబట్టి, ఈలోగా అటు రైతులకు మంచి ధర ఆశ చూపి వారి ఓట్లను కొల్లగొట్టడం, మరోపక్క ఉత్పత్తిదారులు, వ్యాపారులను బతిమిలాడో, బెదిరించో ధర పెరగకుండా నిలువరించి వినియోగదారులు ఆగ్రహానికి గురికాకుండా చూసుకొని మొత్తానికి ఈ ఎన్నికల్లో గట్టెక్కడం బీజేపీ అసలు వ్యూహం.

ఈ కారణం వల్లే ఒక వాణిజ్య పత్రిక కూడా తన కథనంలో బహుశా ఈ విధానాలు తాత్కాలికమే కావచ్చనే ముక్తాయింపును ఇచ్చింది. అదీ విషయం! అలాగే దిగుమతి సుంకాలు తగ్గే వరకు వంట నూనెల ధరలు పెంచొద్దని తయారీ కంపెనీలను ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని మరో వాణిజ్య పత్రిక సెలవిచ్చింది. దీని సారాంశం ఒకటే..! వంటనూనెల దిగుమతులపై సుంకాన్ని పెంచి దేశీయ ఉత్పత్తిదారులకు లబ్ధిని చేకూర్చే ఈ నిర్ణయం కేవలం మూన్నాళ్ల ముచ్చటే! అదీ కథ.

> **అలాగే, ఉల్లిపాయల ఎగుమతులకు మెరుగైన అవకాశాన్ని కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం కూడా అటువంటిదే. అయితే ఈ నిర్ణయం వల్ల ఇప్పటికే ఉల్లి ధర భారీగా పెరగడం మొదలైంది. కాకపోతే, ప్రభుత్వం వద్ద ఉల్లి నిల్వలు సరిపడా ఉన్నాయి. గనుక వాటిని మార్కెట్లోకి విడుదల చేసి ధరల పెరుగుదలను నియంత్రించే అవకాశం ప్రభుత్వం చేతిలో ఉన్నది. ఎన్నికల అనంతరం ఈ విషయంలో కూడా విధాన నిర్ణయం తిరగదోడే అవకాశమే అధికం.**

అంతిమంగా రైతు అనుకూల విధాన నిర్ణయాల పేరిట ఎన్నికల తంతు పూర్తయ్యేవరకు రైతాంగానికి అరచేతిలో వైకుంఠం చూపించి.. ఆ తర్వాత తిరిగి కచ్చితంగా చుక్కలు చూపిస్తారు! అదీ విషయం. 'ఏక్ దిన్ కా సుల్తాన్'గా ప్రస్తుతం రైతాంగానికి పెద్దపీట వేసి పట్టాభిషేకం చేస్తున్నారు. తర్వాతి కథ మామూలే. 'ఏరు దాటే దాకా ఓడ మల్లన్న.. దాటాక...' ఇక చెప్పనవసరం లేదనుకుంట. పార్లమెంట్ ఎన్నికల్లో చావుదెబ్బ తిన్నాక రైతాంగాన్ని విస్మరించి, అధికారాన్ని కాపాడుకోలేమని బీజేపీ గ్రహించింది. అందుకే, నేడు భోళాశంకరుడైన రైతుకు, రైతాంగ సమస్యలకు శాశ్వత పరిష్కారమైన కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను కల్పించే బదులుగా మభ్యపెట్టేందుకు పడరాని పాట్లు పడుతున్నది.

(వ్యాసకర్త: ఆర్థికరంగ నిపుణులు)

ఏరుదాటాక బోడ మల్లన్న!

ఎన్నికల ఏరు దాటాక నిస్సిగ్గుగా, హామీల తెప్పను తగలేస్తున్నవారిలో మోదీ, చంద్రబాబు, రేవంత్ వగైరాలను అగ్రగణ్యులుగా చెప్పుకుంటూ ప్రజలు వాపోతున్నారు. చేతులు కాలాక ఆకులను పట్టుకోవడమంటే ఇదే మరి. ఇచ్చిన హామీలను చెప్పిన సమయంలోపు నెరవేర్చని పాలకులను గద్దె దించే హక్కును ప్రజలకిచ్చే చట్టం రానంతవరకు చీటింగ్ నేతల హవా కొనసాగుతూనే ఉంటుంది. ఎందుకంటే, భారతీయ/మానవీయ సంస్కృతి చీటింగ్‌ను నేరంగా, చీటర్స్‌ను నేరస్థులుగా పరిగణిస్తుంది. కానీ, ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ సంస్కృతి 'చీటింగ్'ను 'టాలెంట్'గా, 'చీటర్స్'ను నిపుణులుగా భావిస్తున్నది. అందువల్లనే చీటింగ్ (అబద్ధాల హామీలు)తో గద్దెనెక్కిన సదరు నేతలు, కార్పొరేట్ మీడియా అండతో 'విజనరీ నేతలు'గా చెలామణి కాగలుగుతున్నారు.

పాతూరి వేంకటేశ్వరరావు
98490 81889

భావోద్వేగాలతో మైకం కమ్మించి మెజారిటీ ఓటర్లను సమీకరించుకునేందుకు మోదీకి, బాబుకు, రేవంత్‌కు రకరకాల సమ్మోహనాస్త్రాలు ఉన్నాయి. కాబట్టి ప్రజలు వాళ్ల పాలనా అనుభవాలను గుర్తుంచుకొని, ఇకనుంచైనా, ఆకర్షణీయ హామీలకు, కుల, మత, భావోద్వేగాలకు లోనుకాకుండా సంయమనం పాటించాలి. గత, ప్రస్తుత ప్రభుత్వాలను, నేతలను బేరీజు వేసుకొని మీడియా, సోషల్ మీడియాలతో కాకుండా సొంత బుద్ధితో, స్వానుభవంతో 'ప్రోగ్రెసివ్ పార్టీ'ని, ప్లానింగ్ నేతలను గుర్తించి ఎన్నుకోవటమే ప్రజలకు శ్రీరామరక్ష.

కార్పొరేట్ మీడియాకు సామాన్య ప్రజలు ప్రభావితులై అపమార్గం పట్టకుండా, వాళ్లకు సరైన దిశానిర్దేశం చేయాల్సిన సామాజిక కర్తవ్యాన్ని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, విస్మరించకుందురుగాక. ఎందుకంటే, 'నంది'ని, 'పంది'గా - 'పంది'ని, 'నంది'గా చేయగలిగినంత శక్తిమంతమైనది మీడియా! అందుకు నిదర్శనాలు 1.మీడియా అండతోనే, చేరదీసిన ఎన్టీఆర్‌ను నెట్టేసి సీఎం కాగలిగాడు చంద్రబాబు. 2.మీడియా అండ లేనందువల్లనే చేరదీసిన జయలలితను ఆస్పత్రి పాలుచేసినా సీఎం కాలేకపోయింది శశికళ. 3.అతి స్వల్పకాలంలో అనన్య సామాన్యమైన అభివృద్ధిని సాధించిన 'ప్రోగ్రెసివ్ పార్టీ బీఆర్ఎస్' మీడియా, సోషల్ మీడియాలను తేలికగా తీసుకున్నందునే ఓటమి పాలైంది. 4. కనీసం మంత్రి కూడా కాని రేవంత్‌రెడ్డి మీడియా, సోషల్ మీడియాల అండదండలతోనే ఏకంగా ముఖ్యమంత్రి కాగలిగాడు.

సీఎం రేవంత్ వాగ్దానాలను ఒకసారి చూద్దాం. 1.గత ప్రభుత్వం తెలంగాణను అప్పుల పాల్జేసిందని, తమకు అధికారం కట్టబెడితే తెలంగాణను ప్రగతిపథాన పరుగెత్తిస్తానని రేవంత్ అన్నాడు. కానీ, కొన్ని నెలల్లోనే, రూ.70 వేల కోట్ల అప్పుల కుప్పను ఆయన ప్రజల నెత్తిన పెట్టాడు. 2. తనను గెలిపిస్తే, ఆరు గ్యారెంటీలు, 60 హామీలతో పాటు, ఏక్ దమ్ముగ ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చాడు. 3.కౌలు రైతులతో సహా అందరికీ రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇస్తానని చెప్పాడు. 4.అప్పులేని రైతులు, గతంలో రుణమాఫీ అయిన రైతులు గూడ, ఇప్పటికిప్పుడు బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షలు తెచ్చుకోవాలని, ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రుణాలన్నీ మాఫీ చేస్తానని వాగ్దానం చేశాడు.

> **షరతులు లేని రుణమాఫీ హామీనిచ్చి గద్దెనెక్కిన రేవంత్.. రూ.49 వేల కోట్ల రుణాలను, షరతులతో రూ.31 వేల కోట్లకు కుదించి, రూ.17 వేల కోట్లతో చేతులు దులుపుకొన్నాడు. వానకాలపు పంట సీజన్ అయిపోతున్నది. రైతుబంధు లేదు, ఫ్రీ బస్ తప్ప 60 హామీల జాడలేదు, అమలు కోసం నిలబడిస్తున్న ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇదిగో ప్రజాపాలన శ్వేత పత్రం, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ అంటూ ప్రచార ఆర్భాటం చేస్తున్నాడు. ఏపీలోనూ సేమ్ టూ సేమ్. చంద్రబాబు ఏకంగా తిరుపతి లడ్డూ పేరిట ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాడు.**

చంద్రబాబు తనవాళ్ల భూముల అభివృద్ధి కోసం హైటెక్ సిటీని అభివృద్ధి చేసుకున్నట్టే.. తన వాళ్ల భూముల విలువ పెంచేందుకు రేవంత్ ఫోర్త్ సిటీని డెవలప్ చేసుకుంటున్నాడనీ, మద్దతు కోసమే అనుకూల జర్నలిస్టులకు అక్కడ ఇండ్ల స్థలాలు కేటాయిస్తున్నాడనీ చాలామంది అంటున్నారు. హైడ్రా పేరిట సామాన్యుల ఇండ్లను కూల్చుతూ, బడాబాబులను నోటిసులతో భయపెడుతూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఆ బెదిరింపుతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లాగేసుకుంటున్నాడనీ ఆబాలగోపాలం గగ్గోలు పెడుతున్నది. రాష్ట్ర, దేశ ప్రజలెంత గగ్గోలు పెట్టినా, ఎన్ని శాపనార్థాలు పెట్టినా, ఈ రాష్ట్రం, దేశం మరింత అప్పులపాలవటం తప్ప ఐదేండ్ల దాకా తమకు ఢోకా లేదని సదరు నేతలకు తెలుసు. వాళ్ల ధీమాకు, దూకుడుకు కారణమదే మరి. ప్రపంచీకరణ సంస్కృతి ప్రవాహంలో కొట్టుకుపోతున్న మోదీ, బాబు, రేవంత్ వగైరాలకు రాజకీయ లాభ దృక్పథమే తప్ప మానవీయ కోణం బొత్తిగా ఉండదు. పేదలు, అన్నదాతల పట్ల వాళ్ల వైఖరే అందుకు నిదర్శనం.

కానీ వాస్తవమేమంటే... అందరి ప్రాణాలకు ఆధారం అన్నం. అన్నాన్ని పండించి అందర్ని బతికిస్తున్నది అన్నదాత. ఆ అన్నదాత కన్నీరు దేశానికి అరిష్టం. అన్నదాతల ఆత్మహత్యలు మానవజాతికే అవమానం. ఈ వాస్తవాన్ని గుర్తించిన నేతల్లో కేసీఆర్ కూడా ఒకరు. అందుకే గద్దెనెక్కిన వెంటనే మిషన్ కాకతీయ, వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు, రైతుబంధు- రైతుబీమా వగైరాలతో అన్నదాతలకు కొండంత భరోసాను కలిగించారు. తద్వారా తొమ్మిదేండ్లలో ఆకలి తెలంగాణను 'అన్నపూర్ణ'గా, భారత ధాన్యాగారంగా రూపొందించారు. అంతేకాదు, ప్రపంచంలోని వ్యవసాయాధారిత దేశాల అభివృద్ధి మార్గాలను అధ్యయనం చేస్తూ, స్వామినాథన్ వంటి సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్తల సహకారంతో, తెలంగాణ ప్రగతి సాధనకు తన దంటూ ఒక ప్రణాళికను రూపొందించుకున్నారు కేసీఆర్. అదే 'వ్యవసాయాధారిత తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి ప్రణాళిక'. ఈ ప్రణాళికతోనే రష్యాను స్టాలిన్, చైనాను డెంగ్ సియావో పింగ్ అమెరికాకు దీటైన అగ్రరాజ్యాలుగా రూపొందించారు. అలాగే తెలంగాణను భారతాగ్ర రాష్ట్రాల్లో ఒకటిగా కేసీఆర్ తీర్చిదిద్దారు. దటీజ్ కేసీఆర్.

> **అందువల్లనే దేశవ్యాప్తంగా సామాజిక స్పృహ గల మేధావులంతా 'ది ప్రోగ్రెసివ్ పార్టీ బీఆర్ఎస్', 'ది బెస్ట్ ప్లానింగ్ లీడర్ కేసీఆర్' అంటూ ప్రశంసలు కురిపించారు. భారతీయ అన్నదాతలంతా 'దేశ్‌కే నేత కేసీఆర్' అంటూ ఆత్మీయంగా స్వాగతించారు. కానీ, పరిస్థితి మారింది. 'అభాండాల, అబద్ధాల వాగ్దాన కర్కుని హామీలకు ఆశపడి, తినే అన్నం పళ్లెంలో చేతులు కడుక్కున్న దురదృష్టవంతులం' అంటూ తెలంగాణ ప్రజలు నేడు వాపోతున్నారు.**

ప్రస్తుతం కష్టాల్లో కూరుకుపోయిన అన్నదాతలతో సహా వివిధ రంగాల తెలంగాణ ప్రజలకు అండగా నిలుస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే. 1.కార్మికులు, కర్షకుల కోసం పోరాడే కమ్యూనిస్టులను ముందుచూపుతో లోబరుచుకుంది రేవంత్ ప్రభుత్వం. అందుకే కనీసం నోరు మెదుపలేకపోతున్నారు కమ్యూనిస్టులు. 2.ఇక బీజేపీని సవాలు చేసే సత్తా గల కేసీఆర్, కేటీఆర్, కేజ్రీవాల్ వగైరాలను తొక్కేయాలన్నదే మోదీ ఆంతర్యం. అందుకే గత ఎన్నికల్లో తానోడి, పరోక్షంగా రేవంత్ గెలుపునకు కృషిచేసింది బీజేపీ. ఇప్పటికీ ప్రత్యక్షంగా చంద్రబాబుతో, పరోక్షంగా రేవంత్‌తో రాజకీయ వ్యాపారం చేస్తున్నది బీజేపీ.

తెలంగాణలో రేవంత్, ఏపీలో బాబు ఏం చేస్తున్నా బీజేపీ మౌనంగా ఉండటమే అందుకు నిదర్శనం. 3.జాతీయ కాంగ్రెస్‌కు భిన్నంగా రేవంత్ అదానీని చేరదీసినా కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు భిన్నంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లాగేసుకుంటున్నా, హైడ్రాతో సామాన్య ప్రజలతో హాహాకారాలు పెట్టిస్తున్నా సరే, కాంగ్రెస్ అధిష్ఠానం చేష్టలుడిగి చూస్తున్నది. ఉత్తర భారతాన ఎన్నికల కోసం కాంగ్రెస్‌కు నిధులను రేవంత్ సమకూర్చుతుండటమే అందుకు కారణం. ప్రస్తుత దురదృష్టకర పరిస్థితికి తల్లడిల్లిపోతున్న అన్నదాతలతో సహా వివిధ వర్గాల ప్రజలందరికీ ఆశాజ్యోతిలా కనిపిస్తున్నది బీఆర్ఎస్. అందుకే బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసుకోవటమే తెలంగాణ ప్రజల ముందున్న ఏకైక పరిష్కారం.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)

ప్రపంచ వాణిజ్యంలో పర్యాటకరంగం ఎంతో కీలకమైనది. కొన్ని దేశాల ఆర్థికవ్యవస్థలు పూర్తిగా పర్యాటకరంగంపైనే ఆధారపడి ఉన్నాయి. ఈ రంగం ద్వారానే పలు దేశాలకు విదేశీ మారక ద్రవ్యం కూడా సమకూరుతున్నది. అయితే, గత కొన్నేండ్లుగా ప్రపంచవ్యాప్తంగా పర్యాటకం తన స్థాయిని మార్చుకుంటున్నది. ఒకప్పుడు పర్యాటకం ఒక విలాసం కాగా.. ఇప్పుడు అది నిత్యావసరం. ప్రజల జీవన స్థాయుల్లో వచ్చిన మార్పులే అందుకు ప్రధాన కారణం.

పర్యాటకం.. దేశాభివృద్ధికి ఊతం

డాక్టర్ రామకృష్ణ బండారు
79057 51940

నేటి సమాజంలో మనిషి నిత్యం ఎన్నో సమస్యలు, ఆలోచనలు, ఒత్తిడితో కూడుకున్న జీవితాన్ని గడుపుతున్నాడు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా, ఐటీ వంటి రంగాల్లో పనిచేసేవారి జీవితం ఎంతో ఒత్తిడితో కూడుకున్నది. అందుకే, అలాంటివారు ఒత్తిడి, సమస్యలకు దూరంగా ఏదో ఒక ప్రదేశానికి వెళ్లి సేద తీరుతున్నారు. గత కొన్నేండ్లుగా పర్యాటక రంగంలో నమోదవుతున్న వృద్ధే అందుకు నిదర్శనం.

వరల్డ్ బ్యాంకు డేటా ప్రకారం.. 1995లో ప్రపంచవ్యాప్తంగా పర్యాటకుల సంఖ్య 1.08 బిలియన్లు ఉండగా.. 2019 నాటికి అది 2.4 బిలియన్లకు చేరుకున్నది. ఇక ఆదాయపరంగానూ పర్యాటకరంగం ముందంజలో ఉన్నది. 1995లో ప్రపంచవ్యాప్తంగా పర్యాటక ఆదాయం 427.57 బిలియన్ డాలర్లు కాగా.. 2019 నాటికి అది 1.47 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ప్రపంచ పర్యాటక, ప్రయాణ మండలి ప్రకారం.. 1995లో ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో ట్రావెల్ అండ్ టూరిజం రంగం వాటా సుమారు 1.5 శాతం ఉండగా అది 2019 నాటికి 10.3 శాతానికి చేరుకున్నది. 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 330 మిలియన్ల మందికి పర్యాటకరంగంలో ఉపాధి లభించింది. ప్రతీ పది మందిలో ఒకరు పర్యాటకరంగంలో ఉపాధి పొందుతున్నవారే. ఇక పెట్టుబడుల విషయానికి వస్తే.. 2010లో ఈ రంగంలో సుమారు 754.6 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రవాహం ఉండగా.. అది 2019 నాటికి 1.1 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇది మొత్తం ప్రపంచ వ్యాప్తంగా అన్నిరంగాల పెట్టుబడుల ప్రవాహంలో 4.5 శాతం. ఈ గణాంకాలు చాలు పర్యాటకరంగం ప్రాముఖ్యాన్ని చెప్పడానికి. ఇక, మన దేశంలోనూ పర్యాటకరంగం చాలా కీలకమైనది. 2001లో విదేశీ పర్యాటకుల రాక కేవలం 2.54 మిలియన్లు ఉండగా అది 2019 నాటికి 10.93 మిలియన్లకు చేరుకున్నది. అదేవిధంగా, విదేశీ మారక ద్రవ్యం 2001లో 3,198 మిలియన్ డాలర్లు రాగా.. 2019 నాటికి అది సుమార